'ద్వితీయ' సమావేశాలు నిర్వహించాలని ఆదేశం

ఈనాడు కథనానికి స్పందన

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సమావేశాలు ప్రతి నెలా రెండుసార్లు నిర్వహించాల్సి ఉంటుంది. మొదటి సమావేశంలో ఆర్థిక లావాదేవీలు, ద్వితీయ సమావేశంలో ఆరోగ్య విషయాలపై చర్చించాలి. మొదటి సమావేశం నిర్వహిస్తున్నప్పటికీ.. రెండో సమావేశంపై మహిళా పొదుపు సంఘాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై ఈ నెల 7న 'ఆరోగ్యంపై అవగాహన పెరిగేదెలా?' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి జ్యోతి స్పందించారు. ప్రతి నెలా 16వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య ద్వితీయ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్యం, పోషణ, సామాజిక అంశాలపై చర్చించాలని సూచించారు.

మంజీరా జలాలు జిల్లా ప్రజల హక్కు: సీపీఎం

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఖేడ్ ప్రాంతంలో సాగుకు మంజీరా జలాలను సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. పార్టీ ఖేడ్ ప్రాంత ద్వితీయ మహాసభలు సోమవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంజీరా నది జలాలు జిల్లా ప్రజల హక్కు అన్నారు. ఖేడ్ ప్రాంతంలో సారవంతమైన భూములు ఉన్నప్పటికీ.. సాగునీరు అందక వేలాది ఎకరాలు బీడుగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ నిత్యవసరాల ధరలు పెంచుతోందని విమర్శించారు. ప్రైవేటు యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్టీ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మాత' దర్శనం.. కనులారా వీక్షణం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ రూపాల్లో అమ్మవార్లను అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మనూరు మండలం బోరంచలోని నల్లపోచమ్మ అమ్మవారిని డీఆర్డీవో పీడీ జ్యోతి, అదనపు పీడీ బాలరాజులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

–న్యూస్‌టుడే, సంగారెడ్డి గ్రామీణ, సదాశివపేట, మనూరు.


బోరంచ అమ్మవారిని దర్శించుకున్న డీఆర్డీవో పీడీ జ్యోతి తదితరులు


ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో లలితాదేవిగా భవానీమాత


సదాశివపేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

మంజూరు 124 పూర్తయినవి 4

జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాల పనుల తీరిది..

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్ (ఇస్మాయిల్‌ఖాన్‌పేట), జోగిపేట, సదాశివపేట, జహీరాబాద్ అర్బన్, నారాయణఖేడ్

ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఆరోగ్య ఉప కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేసింది. ఏడాదిలోపు ఆయా భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాల్సి ఉండగా.. ఇప్పటికీ చాలా చోట్ల తాత్సారం కొనసాగుతోంది. బిల్లుల సమస్య, స్థలాల కొరత తదితర కారణాలతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదు.

మూడు శాఖల పర్యవేక్షణ

81 ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల పనులను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. వీటిలో నాలుగు పూర్తికాగా. . 38 చోట్ల తట్టెడు మట్టైనా తీయలేదు. తెలంగాణ ప్రభుత్వ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ)కి తొమ్మిది కేటాయించారు. స్థలాల లభ్యత లేకపోవడంతో పనులు చేపట్టలేదు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీవో) ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సభ్యులకు 34 పనుల బాధ్యతను అప్పగించారు. ఒక్కటీ పూర్తికాలేదు. బిల్లుల సమస్యే ప్రధాన కారణమని పలువురు పేర్కొంటున్నారు.

ఒక్కో నిర్మాణానికి రూ.20 లక్షలు

కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) అమలులో భాగంగా ఆరోగ్య ఉప కేంద్రాలను మంజూరు చేసింది. ఒక్కో ఉప కేంద్రం భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. మొత్తం 124 భవనాలు మంజూరు చేయగా.. నాలుగు చోట్ల మాత్రమే పనులు పూర్తయ్యాయి.


అసంపూర్తిగా రాజంపేట ఆరోగ్య ఉప కేంద్రం

నియోజకవర్గం	మంజూరు	పనులు చేపట్టినవి	చేపట్టనివి	స్థలాల కొరత	పూర్తయినవి
అందోలు	29	11	14	4	0
నారాయణఖేడ్	13	8	4	1	0
పటాన్‌చెరు	26	12	4	9	1
సంగారెడ్డి	22	16	2	3	1
హత్నూర	9	1	6	0	2
జహీరాబాద్	25	6	14	5	0
మొత్తం	124	54	44	22	4

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం...

జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. బిల్లుల సమస్యతోపాటు స్థల సేకరణపై త్వరలో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తాం. బిల్లుల సమస్యపై కలెక్టర్ ద్వారా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా దృష్టికి తీసుకెళతాం.

–జగదీశ్వర్(పీఆర్ ఎస్ఈ), రవీందర్‌రెడ్డి(టీజీఎంఎస్ఐడీసీ ఈఈ), జ్యోతి(డీఆర్‌డీవో).

స్థలాల కొరత: అందోలు మండలానికి తొమ్మిది కేటాయించగా.. మూడు చోట్ల భూమి పూజ చేశారు. ఇప్పటికీ పనులు చేపట్టలేదు. సంగారెడ్డి పట్టణం రాజంపేటలో పనులు తుది దశకు చేరుకున్నాయి. నిర్మాణం పూర్తి చేయడానికి అదనపు నిధులు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపారు. జహీరాబాద్ మండలం మల్‌చెల్మ, బూచినెల్లి, కోహీర్ మండలం కవేలి, దిగ్వాల్, ఖానాపూర్, జహీరాబాద్‌లో పట్టణం, మనూరు, పటాన్‌చెరులో స్థలాల లభ్యత లేదు.


జోగిపేట పోచమ్మ ఆలయం వద్ద..

తీరొక్క పూలు.. ఆధ్యాత్మిక పరిమళాలు

జిల్లాలో సోమవారం బతుకమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించారు. అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక చోటుకు చేర్చి ఆడిపాడారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా న్యాయమూర్తి జి.భవానీ చంద్ర ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తులు కె.జయంతి, సునీతా రవీంద్రారెడ్డి, రాధాకృష్ణాచౌహాన్, బి.రమేశ్, శాలిని, తేజశ్రీ తదితరులు సంబరాల్లో భాగస్వాములయ్యారు. సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఉత్సవాల్లో డిపో మేనేజర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆటపాటతో ఆకట్టుకున్నారు. ఐడీఏ బొల్లారంలో పురపాలిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఛైర్‌పర్సన్ కె.రోజారాణి, కమిషనర్ మంగతాయారు, మేనేజర్ నిర్మలారెడ్డి తదితరులు బతుకమ్మలతో సందడి చేశారు. జోగిపేట పట్టణంలో సద్దుల బతుకమ్మ పండగను నిర్వహించారు. ఉత్సవాల కోసం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాట్లు చేశారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి టౌన్, జోగిపేట, జిన్నారం.


బతుకమ్మతో జిల్లా న్యాయమూర్తి భవానీచంద్ర


సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో..


ఐడీఏ బొల్లారం పురపాలిక ఎదుట..

విషవాయువులతో ఉక్కిరి బిక్కిరి

గడ్డపోతారం, బొలారం, ఖాజీపల్లిలో దుస్థితి


గడ్డపోతారం పారిశ్రామిక వాడలో దట్టంగా అలుముకున్న విషవాయువులు

న్యూస్‌టుడే, జిన్నారం: జిన్నారం మండలం గడ్డపోతారంలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల గ్రామస్థులు పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమల వద్దకు వెళ్లి ఆరా తీసినా.. 'సమస్య మాది కాదని' యజమానులు బుకాయించారు. కాలుష్యం సమస్య తీవ్రంగా ఉంటే యాజమాన్యాలు స్పందించిన తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పీసీబీ అధికారులు ఇదిగో టాస్క్‌ఫోర్స్ వస్తోందంటూ.. కాలయాపన చేస్తున్నారని, సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి ఖాజీపల్లి, 181 జీఎంఆర్ కాలనీతో పాటు ఐడీఏ బొల్లారం పట్టణంలోనూ రోజురోజుకు తీవ్రమవుతోంది.

హెచ్చరికలు బేఖాతరు

ఇటీవల రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖా పీసీబీ తీరుపై 70 పేజీల లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాయడం సంచలనమయింది. నెల రోజుల క్రితం రాష్ట్ర హైకోర్టు పీసీబీ తీరు మార్చుకోకుంటే రద్దుకు సిఫార్సు చేస్తామంటూ హెచ్చరించింది. ఇంతటి స్థాయిలో హెచ్చరికలు ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పీసీబీ అధికారుల తీరు యాజమాన్యాలకు అనుకూలంగానే ఉంటోందనే విమర్శలొస్తున్నాయి. కాలుష్య జలాలు తాగి కిష్టాయపల్లిలో 25, ఖాజీపల్లిలో ఐదు గేదెలు మృత్యువాతపడినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అనారోగ్య సమస్యలు

ప్రధానంగా రాత్రి వేళల్లో ఘాటు వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాంతులు, తలనొప్పి, శరీరంపై దద్దుర్లు, తుమ్ములు, దగ్గు వంటి సమస్యలు ఇటీవల అధికమయినట్లు స్థానికులు చెబుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధుల బాధ వర్ణనాతీతంగా ఉంటోంది. పారిశ్రామిక ప్రాంతంలో వైద్య నిపుణులతో సర్వే చేస్తే చాలా కాలుష్య సమస్యలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఉత్పత్తులతో వెలువడే వాయువులను ఫిల్టర్ చేయకుండానే వదలడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ విషయమై పీసీబీ ఈఈ కుమార్ పాఠక్‌ను అడగగా. . ఫిర్యాదులు రాగానే వెంటనే స్పందిస్తున్నామని, కాలుష్య కట్టడికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు కాలుష్య నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు వివరించారు.

కూలిన గ్రంథాలయ భవనం.. తప్పిన ప్రాణాపాయం

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నలభై ఏళ్ల క్రితం నిర్మించిన రాయికోడ్‌లోని గ్రంథాలయ భవనం సోమవారం కూలిపోయింది. గ్రంథాలయంలో పనిచేసే యువకుడు వీర్‌శెట్టి గదులను శుభ్రం చేసి బయటకు వచ్చిన వెంటనే కుప్పకూలింది. ఆ సమయంలో పాఠకులు ఎవరూ అందులో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. –న్యూస్‌టుడే, రాయికోడ్.



అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించండి: కలెక్టర్


సమీక్ష నిర్వహిస్తున్న వల్లూరు క్రాంతి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఫ్రైడే-డ్రైడే నిర్వహణతోపాటు.. పాఠశాలలు, వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజారాణి పాల్గొన్నారు.

ప్రజావాణికి 55 వినతులు


అర్జీలు అందజేసేందుకు వచ్చిన ప్రజలు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అధికారులకు వినతిపత్రాలను అందజేసి.. పరిష్కరించాలని అభ్యర్థించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతితో పాటు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. 55 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు.

ఇంటికి తిరిగొస్తూ మృత్యువాత

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన కర్ణాటక బస్సు

జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్, న్యూస్‌టుడే: పొలానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగొస్తున్న కుటుంబాన్ని బస్సు మృత్యు రూపంలో బలిగొంది. ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్న క్రమంలో మృత్యుశకటంలా దూసుకొచ్చిన కర్ణాటక ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ వద్ద సోమవారం జహీరాబాద్-బీదర్ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్ఐ రామునాయుడు తెలిపిన వివరాలు.. గణేష్‌పూర్‌కు చెందిన గునెల్లి సిద్రామ్(70), తన అల్లుడు జగన్నాథ్(40), కూతురు రేణుక(35), మనవడు వినయ్‌కుమార్(14)తో కలిసి పొలానికి ద్విచక్రవాహనంపై వెళ్లి ఇంటికి తిరిగొస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది.

ఘటనా స్థలిలోనే ఒకరు..

ద్విచక్ర వాహనాన్ని ఉద్గీర్ వెళ్తున్న బస్సు వేగంగా ఢీకొట్టడంతో వెనకాల కూర్చున్న సిద్రామ్, మధ్యలో కూర్చున్న రేణుక ఎగిరి కిందపడిపోయారు. తలకు తీవ్రగాయాలైన సిద్రామ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనా స్థలంలో ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న భార్యాభర్తలు జగన్నాథ్, రేణుక సహా వారి కుమారుడు వినయ్ కుమార్‌ను స్థానికులు హుటాహుటిన కర్ణాటకలోని బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జగన్నాథ్, రేణుక మృతి చెందినట్లు చెప్పగా.. చికిత్సకు ఏర్పాట్లు చేస్తుండగా వినయ్‌కుమార్ మరణించాడు.

అమ్మానాన్న, తమ్ముడిని కోల్పోయి..

సిద్రామ్‌కు రేణుక ఒక్కరే కూతురు కావడంతో అదే ఊరికి చెందిన జగన్నాథ్‌ను ఇల్లరికం తెచ్చుకున్నాడు. జగన్నాథ్, రేణుక దంపతులకు వైష్ణవి, లక్ష్మి, వినయ్‌కుమార్, నాగలత సంతానం. ప్రమాదంలో అమ్మానాన్నలు, తమ్ముడు సహా తాతను కోల్పోవడంతో రేణుక కూతుళ్ల రోదనలు మిన్నంటాయి. ఊరికి కూతవేటు దూరంలోనే అమ్మానాన్నలు ప్రమాదంలో మృతిచెందారని తెలుసుకొని ఘటనా స్థలంలో కన్నీరుమున్నీరయ్యారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, గ్రామీణ సీఐ హన్మంతు ఘటనా స్థలిని సందర్శించి వివరాలు సేకరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, న్యూస్‌టుడే: మండల పరిధి ఖాజీపల్లిలో అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గ్రామ శివారు 181 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి నేలమట్టం చేశారు. తహసీల్దార్ భిక్షపతి ఆదేశాలతో ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ నాలుగు నిర్మాణాలను కూల్చివేయించారు. తిరిగి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి


సదాశివపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గోదావరి

సదాశివపేట, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హయాంలోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని భాజపా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. సోమవారం భాజపా పట్టణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. భాజపా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్‌రావు, నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రసంగిస్తున్న తూర్పు నిర్మలారెడ్డి

సదాశివపేట, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ తూర్పు నిర్మలారెడ్డి అన్నారు. సోమవారం సదాశివపేటలో సీడీసీ ఛైర్మన్ గడీల రాంరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తుందన్నారు. త్వరలో రైతులందరికీ పెట్టుబడి సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి పాల్గొని సీడీసీ ఛైర్మన్ రాంరెడ్డిని అభినందించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కంది కృష్ణ, పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు సత్యనారాయణ, సిద్దన్న, నాయకులు పాల్గొన్నారు.

నేడు భగీరథ నీటి సరఫరా నిలిపివేత

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: అందోలు-జోగిపేట పురపాలిక పరిధిలో మిషన్ భగీరథ నీటి సరఫరాను మంగళవారం నిలిపివేస్తామని కమిషనర్ తిరుపతి తెలిపారు. పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట శివారులో మిషన్ భగీరథ సంపు వద్ద నియంత్రిక కాలిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే మరమ్మతులు చేపడతామని వివరించారు.

గిరిజన యువత ఎదురుచూపులు

గ్రౌండింగ్‌కు నోచని స్వయం ఉపాధి యూనిట్లు



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

గిరిజనుల పరిస్థితి ఇప్పటికీ దయనీయమే. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ గ్రామాలకు దూరంగా తండాల్లో జీవనం సాగిస్తున్న వారే ఎక్కువ. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించలేకపోతున్నారు. రిజర్వేషన్లు ఉన్నప్పటికీ.. పోటీ పెరగటంతో కొంతమంది మాత్రమే అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. స్వయం ఉపాధి యూనిట్లు ఏళ్లుగా గ్రౌండింగ్‌కు నోచకపోవడంతో గిరిజన యువతకు ఇబ్బందులు తప్పడంలేదు. రాయితీ నిధుల విడుదలలో జాప్యమే దీనికి కారణమవుతోంది.

86వేలకు పైగా జనాభా

జిల్లా జనాభా 15.27లక్షలు. ఇందులో గిరిజన జనాభా 86,410. అత్యధికంగా మొగుడంపల్లి మండలంలో 7,918 మంది, నాగలిగిద్ద మండలంలో 7,555 మంది గిరిజనులు ఉన్నారు. మొగుడంపల్లి మండల జనాభాలో 21.73శాతం, నాగలిగిద్ద మండల జనాభాలో 24.25శాతం మంది గిరిజనులే కావటం విశేషం. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మనూరు మండలం మినహా మిగతా అన్ని మండలాల్లోనూ గిరిజనుల జనాభా 10శాతంపైనే ఉండటం గమనార్హం.

డివిజన్	గిరిజనులు	శాతం
నారాయణఖేడ్	38,745	15.77
సంగారెడ్డి	28,977	3.19
జహీరాబాద్	18,688	5.02

రూ.7.81 కోట్ల రాయితీతో ప్రణాళిక

ట్రైకార్ ద్వారా గిరిజన యువతకు స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తున్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ.1.63కోట్లు, 2021-22లో అదనంగా రూ.6.17 కోట్లు కేటాయించారు. రెండు సంవత్సరాలకు కలిపి రాయితీ కింద రూ.7.81కోట్లు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. రెండు ఆర్థిక సంవత్సరాలకు కలిపి 958 యూనిట్లు గ్రౌండింగ్ చేయాల్సి ఉంది. ఆయా యూనిట్ల కోసం 2,458 దరఖాస్తులు రాగా.. అర్హులను ఎంపికచేశారు. 2020-21 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2021-22 ఆరు రెట్లు అధికంగా నిధులు కేటాయించడంతో ఎక్కువ మందికి లబ్ధిచేకూరుతుందని గిరిజన యువత సంబరపడ్డారు. రెండేళ్లు దాటినా రాయితీ నిధుల విడుదల ఊసే లేకపోవడంతో వారికి నిరాశే మిగిలింది.

ఏడాది కిందటే మంజూరు పత్రాలు ఇచ్చారు

–రాము, రాంపూర్ తండా

స్వయం ఉపాధికి రాయితీ రుణం కోసం మూడేళ్ల కిందట దరఖాస్తు చేశా. ఏడాది కిందట అధికారులు యూనిట్ మంజూరుకు సంబంధించిన మంజూరు పత్రాలు ఇచ్చారు. ఇప్పటివరకు రాయితీ అందలేదు. రాయితీ సొమ్ము ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారుల చుట్టూ తిరుగుతున్నా... ఫలితం లేదు.

నిధులు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం

–అఖిలేష్‌రెడ్డి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి

గిరిజన యువతకు స్వయం ఉపాధి కోసం రాయితీ నిధులు విడుదల కాగానే యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను ప్రారంభిస్తాం. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం నిధుల విడుదలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అదనులో సాగు.. దిగుబడి బాగు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్



చిక్కుడు సాగుకు చల్లని వాతావరణం అవసరం. శీతాకాలం పంటగా ప్రస్తుత తరుణంలో సాగు చేయాలని చెబుతున్నారు సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారిణి సునీత. శీతాకాలం పంటగా అక్టోబరు- నవంబరు మాసాలలో సాగు చేయాలి. ఈ పంట అధిక ఉష్ణోగ్రత, అధిక వర్షపాతాన్ని, అధిక మంచును తట్టుకోలేదు.

అనుకూలమైన
రకాలు: తీగ రకం: కెంటకీ వండర్, టీకేడీ-1.
పొది రకం: కంటెండర్, అర్కకోమల్, అర్కసువిధ
నేలలు..: ఇసుకతో కూడిన ఎర్ర గరప, ఒండ్రు నేలలు, నీటి వసతి ఉన్న బరువైన నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5-3-6 ఉన్నవి అనుకూలం.

విత్తనాలు, ఎరువులు..

● తీగ రకాలైతే ఎకరానికి 10-12 కిలోలు, పొద రకం ఎకరానికి 20-24 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. పొలంలో విత్తే ముందు 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ వినియోగించి కిలో విత్తనాన్ని శుద్ధి చేయాలి.

● దుక్కి దున్ని 30-35 సెం.మీ. దూరంలో బోదెలు వేసుకోవాలి. ఒక్కో వరుసలో 25-30 సెం.మీ. దూరంలో విత్తనాలు నాటాలి.

● ఆఖరి దుక్కిలో ఎకరాకు 8-10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 10 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ చల్లితే ప్రయోజనంగా ఉంటుంది.

చీడపీడల నివారణ..

ఈ పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తాయి. తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 300 గ్రా. లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● పేనుబంక తెగులు ఆశిస్తే మిథైల్ డిమెటాన్ 400 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

● భూమిలో తేమ అధికంగా ఉంటే వేరుకుళ్లు తెగులు ఆశిస్తుంది. లేతమొక్కలు చనిపోతాయి. 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి లేదా 3 గ్రా. థైరామ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి.

● ఆకుమచ్చ తెగులు నివారణకు సీఓసీ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నీటి తడులు..

పూత దశలో ఎకరానికి 10 కిలోల నత్రజనిచ్చే ఎరువులు వేయాలి. అనంతరం నీటి తడులు అందించాలి. నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. పూత దశలో తేమ ఎక్కువ, తక్కువ కాకుండా చూసుకోవాలి. సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. తీగ రకాలైతే ఎకరానికి 5-6 టన్నులు, పొదరకం 3-4.5 టన్నుల వరకు వస్తుంది.

రైతేరాజు

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం:
93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: వరిలో ఆకులపై పసుపు రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. నివారణ చర్యలు తెలపండి? – **గోవర్ధన్, తాండూరు**

సమాధానం: ఎండాకు తెగులు సోకితే ఇలాగే జరుగుతుంది. వెంటనే పై పాటుగా నత్రజని ఎరువు వేస్తే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, చేర్యాల

వేరుసెనగలో సస్యరక్షణ కీలకం

నూనె గింజల పంటల సాగులో ప్రధానమైన వేరుసెనగలో సస్యరక్షణ పక్కాగా చేపడితే అధిక దిగుబడి సాధ్యం. ప్రస్తుత యాసంగిలో అత్యధికులు ఈ పంట సాగు చేస్తున్నారు. సెప్టెంబరులో పలువురు దీన్ని పండిస్తున్నారు. ఇప్పటికే మొలకలు వచ్చాయి. ప్రస్తుతం ఆకుముడత, పొగాకు లద్దె పురుగు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. ఆకు ముడత నివారణకు లీటరు నీటికి నొవాల్యురాన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 5.మి.లీ. వేపనూనె లేదంటే 2 మి.లీ.క్వినాల్‌ఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ**

మెరుగైన సేవలు.. దరిచేరిన పురస్కారాలు

మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నాణ్యతాప్రమాణాలు పాటిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం కాయకల్ప పురస్కారాలు అందిస్తోంది. 2023-24 సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల నుంచి పలు దవాఖానాలు పురస్కారాలకు ఎంపికై ప్రత్యేకతను చాటడం విశేషం.

న్యూస్‌టుడే, తాండూరు టౌన్, గజ్వేల్, గుమ్మడిదల

అందుబాటులో ఉంటూ..



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సైతం కాయకల్ప అవార్డు దక్కింది. ఇక్కడికొచ్చే రోగులను మర్యాదగా పలకరించి వారి బాధ తెలుసుకొని వైద్య సేవలు అందించడం ఇక్కడి వైద్యులు, సిబ్బందికి అలవాటు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ఈ కేంద్రానికి నిత్యం 70 నుంచి 100 మంది వరకు పేషెంట్లు వస్తున్నారు. అవసరమైన వారిని జిల్లా కేంద్రానికి రిఫర్ చేస్తున్నారు. మరోవైపు కేంద్రం పరిధిలో గర్భిణుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు చర్యలు తీసుకుంటున్నారు. అవార్డు కింద రూ.2 లక్షలు రానున్నాయి. ఈ నగదుతో ఆసుపత్రిలో రోగులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తామని వైద్యులు మధుకర్, విజేతలు తెలిపారు.

పారిశుద్ధ్యం నిర్వహణలో భేష్



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి ఇప్పటివరకు మూడుసార్లు వరుసగా కాయకల్ప అవార్డులు దక్కాయి. ఈ సారి ద్వితీయ స్థానంలో నిలిచింది. పరిసరాల పారిశుద్ధ్యం, వైద్య వ్యర్థాల నిర్వహణ, వార్డుల పర్యవేక్షణ తదితర 8 విభాగాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ఇందుకు ఎంపికైంది. రూ.40 కోట్లతో 100 పడకల సామర్థ్యంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. ప్రస్తుతం నెలకు 350 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లల ఐసీయూ, వృద్ధులకు మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సలు సైతం చేస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం పాలియేటివ్ వార్డు, 7 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటయ్యాయి. నెలకు 15 వేల మందికి పైగా ఓపీ, 600 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. పరిసరాలు, ఆవరణ, వార్డులు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. నిత్యం 500 కిలోల సాధారణ వ్యర్థాలను బల్దియా సేకరిస్తుండగా, రెండురోజులకో సారి 500 కిలోల బయో వ్యర్థాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆవరణ మొక్కలతో వనాన్ని తలపిస్తోంది.

ముందంజలో నిలిచి..



ఆసుపత్రిలోని వార్డు

వికారాబాద్ జిల్లా తాండూరులో 20 ఏళ్ల కిందట 200 పడకలతో జిల్లా స్థాయి ఆసుపత్రిని నిర్మించారు. నిత్యం జిల్లా వాసులతో పాటు మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, సరిహద్దు రాష్ట్రం కర్ణాటక నుంచి ప్రజలు ఇక్కడికి వైద్యసేవల నిమిత్తం వస్తుంటారు. రోజూ 800 మందికి పైగా సేవలు పొందుతున్నారు. 100 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. వైద్యులు, సిబ్బంది బాధితుల ఇబ్బందులను తెలుసుకొని అందుకు అనుగుణంగా చికిత్స అందిస్తూ ఉపశమనం కలిగిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలతో పాటు పరిసరాల శుభ్రత తదితర అంశాల్లో ముందంజలో నిలుస్తోంది. తద్వారా రాష్ట్ర స్థాయిలో అవార్డులు దక్కుతున్నాయి. తొలిసారిగా 2021లో కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. 2022లో రెండో సారి, తాజాగా ఈ ఏడాది మూడో సారి అవార్డు దక్కించుకుంది.

● ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో మెరుగ్గా ఉండటంతో రాష్ట్ర స్థాయిలో తొలిస్థానంలో నిలిచింది. కాయకల్ప అవార్డు రూ.25 లక్షలు రానున్నాయి. వీటితో వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించనున్నామని ఆసుపత్రి పర్యవేక్షకుడు శంకర్ తెలిపారు.

సమష్టిగా అడుగేస్తూ.. లాభాలు ఆర్జిస్తూ..



కాకర తోట



మధుసూదన్‌రెడ్డి



లక్ష్మారెడ్డి

సమష్టిగా ముందుకు సాగితే ఏదైనా సాధ్యమే. ఏ రంగంలోనైనా ఇది వర్తిస్తుంది. ఈ సూత్రాన్ని నమ్మిన ఈ అన్నదమ్ములు కలిసి సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వారే నర్సాపూర్ మండలం ఆవంచకు చెందిన మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి. వీరికి పదెకరాల పొలం ఉంది. ఐదెకరాలలో వరి, మిగతా దాంట్లో బీర, సొర, కాకరతో పాటు ఆకుకూరలు పండిస్తున్నారు. మొదట్లో మాములుగా పండించగా.. ఆ తర్వాత పందిరి సాగు విధానాన్ని పాటిస్తున్నారు. కడీలు పాతించి తీగలు అల్లించారు. అంతర పంటగా ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

నీటిని నిల్వ చేసుకొని..

పంటలకు అవసరమైన మేర నీటి తడులు అందించాలన్న ఉద్దేశంతో పొలంలో నిల్వ గుంత తవ్వించారు. అందులోకి వాన నీరంతా చేరేలా ఏర్పాట్లుచేశారు. బోరు నీటిని సైతం అందులోకి పారిస్తారు. అందులోనే సేంద్రియ ఎరువులు కలిపి బిందు పరికరాల ద్వారా కూరగాయల మొక్కలకు పారేలా చేస్తున్నారు. ఈ విధానంలో సమయం ఆదా కావడంతో అవసరం మేర మాత్రమే నీటిని వాడుతున్నారు. ఒకే పంట కాకుండా పలు రకాలవి సాగు చేయడం అంతగా నష్టం వాటిల్లదు. మూడు నెలల్లో ఆయా రకాలు 300 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. విత్తనాలు, ఎరువులు తదితర వాటికి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. దిగుబడులను నర్సాపూర్, హత్నూర మండలం దౌల్తాబాద్, జిన్నారం మార్కెట్లలో విక్రయిస్తున్నారు. రూ.3 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోగా రూ.1.50 లక్షల వరకు లాభం మిగులుతోంది. మరోవైపు వరితో రూ.3 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. ఆకుకూరలతో రూ.50 వేల వరకు వస్తున్నాయి.

– న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్

పత్తిలో వేరుకుళ్లు తెగులా..



పత్తిలో వేరుకుళ్లు తెగులు అధిక తేమ శాతం కారణంగా ఆశిస్తుంది. దీని నివారణలో నిర్లక్ష్యం చేస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా.కార్బెండాజిమ్ కలిపిన ద్రావణాన్ని మొక్కల పాదుల చుట్టూ పిచికారీ చేయాలి. వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు ఇలా చేస్తే తెగులు నివారణ సులభమే.

- న్యూస్‌టుడే, చేర్యాల

పద్య సాహిత్యం సమాజానికి అవసరం



ట్రెండింగ్ పద్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పద్య సాహిత్యం సమాజానికి ఎంతో అవసరమని అవధాని, పద్యసారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అవుసుల భానుప్రకాశ్ అన్నారు. పద్యం ద్వారానే బాలలు నీతి నిజాయతీ, న్యాయం నేర్చుకుంటారన్నారు. ఆయన రచించిన 'ట్రెండింగ్ పద్యాలు' పుస్తక పరిచయ సభ సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మాట్లాడారు. బాలల నుంచి యువత, వృద్ధుల వరకు చదివే పుస్తకం ట్రెండింగ్ పద్యాలు అని అన్నారు. కవి ఐతా చంద్రయ్య మాట్లాడుతూ సంప్రదాయాలకు అనుగుణంగా సాహిత్య రచనలు ఉండాలన్నారు. మరో కవి కొమురవెల్లి అంజయ్య మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రచనలు రావాలన్నారు. కార్యక్రమంలో గోగులపాటి కృష్ణమోహన్, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, సింగీతం నరసింహారావు, సరస్వతీ రామశర్మ, బస్వ రాజ్‌కుమార్, కాంతికృష్ణ, నాగలత, యాదగిరి, మహేందర్ రెడ్డి, బాలచంద్రం, అంజిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సుడోకు పోటీలకు జైపాల్‌రెడ్డి



జైపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి

జహీరాబాద్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన భాజపా నాయకుడు, మెదక్ డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఆయన తనయుడు కార్తీక్‌రెడ్డి ప్రపంచ సుడోకు, పజిల్ పోటీలకు ఎంపికయ్యారు. చైనా బీజింగ్‌లో ఈ నెల 14 నుంచి వారం పోటీలు జరగనున్నాయి. లాజిక్ మాస్టర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏడాది పాటు ఆన్‌లైన్ ద్వారా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని 50 మందిని గుర్తించి, వీరికి గత ఆగస్టు 10,11 తేదీల్లో బెంగళూరులో పోటీలు నిర్వహించి నలుగురు ఎంపిక చేయగా, అందులో జహీరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు ఉండటం విశేషం.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

మనోవేదనతో వృద్ధుడు..

రామాయంపేట: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట ఎస్సై పుట్టి స్వామి తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన పుట్టి స్వామి (58) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడు. స్థానిక కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అన్ని చోట్ల వెతకగా సోమవారం స్థానిక చెరువులో మృతదేహం కనిపించింది. కుమారుడు సాయికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

క్యాన్సర్ తగ్గక వృద్ధుడు..



నాగయ్య

మనోహరాబాద్: క్యాన్సర్‌తో బాధపడుతున్న మనోహరాబాద్‌కు చెందిన తూం నాగయ్య(60) ఇంట్లోనే ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. నాగయ్య కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండేళ్లుగా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా తగ్గలేదు. ఈ నెల 4న ఇంట్లో ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన అతడి భార్య ములుగులోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు మల్లేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మద్యం మత్తులో యువకుడు..



రాకేష్

బెజ్జంకి: మద్యం మత్తులో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని దాచారానికి చెందిన చెందిన బొర్ర రాజు, సరవ్వ చిన్న కుమారుడు రాకేష్ (20) పదో తరగతి వరకు చదివి మానేశాడు. కూలీ పనులతో పాటు హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆదివారం రాత్రి భోజనం చేశాక పడక గదిలోకి వెళ్లాడు. వెంటిలేటర్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించగా.. కుటుంబీకులు గమనించి కిందికి దించి సీపీఆర్ చేశారు. అప్పుడే చేరుకున్న 108 వాహన సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తేల్చిచెప్పారు. ఇంటికొచ్చిన కొడుకు అరగంట వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో కుటుంబీకులు బోరున విలపించారు. సోమవారం కేసు నమోదైంది.

బావిలో పడి మహిళ మృత్యువాత

రామాయంపేట: ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిన ఓ మహిళ మృతి చెందింది. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. లక్ష్మాపూర్‌కు చెందిన కాసుల నాగవ్వ (53) ఆదివారం రాత్రి తమ పొలానికి వెళ్లింది. అడవి పందుల నుంచి కాపలాకు బ్యాటరీ లైట్‌తో పొలంలో తిరుగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయింది. సోమవారం ఉదయం కుమారుడు దుర్గరాజు పొలానికి వెళ్లగా తల్లి నాగవ్వ కనిపించలేదు. బావి గట్టుపై చెప్పులు, బ్యాటరీ పడి ఉన్నాయి. అందులో వెతకగా నాగవ్వ మృతదేహం లభ్యమైంది. దుర్గరాజు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చేపల వేటకు వెళ్లి యువకుడు..



యాదగిరి

పాపన్నపేట: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన రొడ్డ యాదగిరి(31) రైతు. సోమవారం పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114-00	డ్రెస్ట్	197-00
రిటైల్	136-00	స్కిన్‌లెస్	224-00

ఫుట్‌బాల్ ఫైనల్‌కు రంగారెడ్డి జట్టు



పోటీలు ప్రారంభిస్తున్న మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మెదక్‌లో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, పోటీల కోఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో రెండో రోజు సోమవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 10 జట్లు పాల్గొనగా, రెండు గ్రూప్‌లుగా విభజించి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. లీగ్ దశలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్ నిజామాబాద్-రంగారెడ్డి జట్ల మధ్య జరిగింది. ఇందులో రంగారెడ్డి జట్టు ఫైనల్‌కు వెళ్లింది. మరో సెమీఫైనల్ పోటీ మంగళవారం మెదక్, ఆదిలాబాద్ జట్ల మధ్య జరగనుంది. ఇందులో గెలుపొందిన జట్టు రంగారెడ్డితో ఫైనల్‌లో ఆడనుంది. రెండో రోజు పోటీలను మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ప్రారంభించారు. పోటీలకు సినీ నిర్మాత సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, సిద్దార్థ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరిలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు మాధవరెడ్డి, చంద్రమోహన్, శ్యామయ్య, రాజేందర్, సత్యం, దేవేందర్‌రెడ్డి, రవి, పద్మ, సరోజిని, మహిపాల్ తదితరులు ఉన్నారు.

ఆగిన కుంచె.. మూగపోయిన కంఠం



నర్సింలు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడు నర్సింలు మృతితో చిత్రాలకు జీవం పోసే కుంచె ఆగిపోయింది. సమాజాన్ని చైతన్యపరిచే కలం నుంచి జాలువారిన గీతాలు, ఆలపించిన కంఠం మూగపోయింది. వికారాబాద్ పుర పరిధి గిరిగిట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మర్పల్లి మండలం కల్కోడకు చెందిన నర్సింలు (50) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడే అయినా ప్రవృత్తిలో చిత్రకళాకారుడిగా, గాయకుడుగా, పాటల రచయితగా అందరికీ సుపరిచితుడు. సమాజాన్ని మేల్కొలిపే బాలల హక్కులు, మూఢనమ్మకాలు, అక్షరాస్యత, తెలంగాణ ఉద్యమంపై ఎన్నో పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. ఎంతో మందికి చిత్రలేఖనంలో మెలుకువలు నేర్పించారు. ఆయన మృతికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

కళా ఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్‌లో భాగంగా ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్లస్టర్ స్థాయి బృందగానం పోటీల్లో ప్రథమ, బృందనృత్యంలో ద్వితీయ స్థానంలో నిలిచారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించే రీజినల్ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తల జాబితాలో అళగర్ స్వామికి చోటు



సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని ఎంఎన్‌ఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అళగర్ స్వామి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రపంచ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ విశ్వవిద్యాలయం సెప్టెంబరు 15న జాబితా ప్రకటించగా.. కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.ఎన్.రాజు మాట్లాడుతూ.. అళగర్ స్వామి యాంటీ వైరల్ మెడిసిన్స్ ఫార్మసీలో పరిశోధన చేసినందుకు ప్రపంచ ర్యాంకింగ్‌లో స్థానం దక్కినట్లు పేర్కొన్నారు. 2020 నుంచి ఈ ఏడాది వరకు వరుసగా అయిదు సార్లు జాబితాలో చోటు కల్పించారని, ర్యాంకింగ్స్‌లో తెలంగాణలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. గ్లోబల్ ర్యాంకు 1,48,458, పరిశోధనల్లో 1,795 ర్యాంకు సాధించారన్నారు. ఆయన పలు రకాల పుస్తకాలు రాసి జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ రవివర్మ తదితరులు అళగర్ స్వామిని అభినందించారు.



బతుకమ్మ సంబురం.. ఆనందం అంబురం

తాండూరు పట్టణంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. శాంతినగర్ కాలనీలోని మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాటలు పాడుతూ కోలాటం, దాండియా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణ శివారులోని కాగ్న నదిలో నిమజ్జనం చేశామని స్నేహ బృందం ప్రతినిధి అనురాధ తెలిపారు. **- న్యూస్‌టుడే, పాత తాండూరు**

సాగు పెరిగేలా.. అవగాహన పెంపెందించేలా..

● నేడు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో డ్రాగన్ ఫ్రూట్ మేళా

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్



డ్రాగన్ ఫ్రూట్



పూత దశలో

డ్రాగన్ ఫ్రూట్‌లో ఆరోగ్యానికి మేలు చేసే గుణాలెన్నో ఉన్నాయని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. ఇటీవలి కాలంలో మార్కెట్‌లో ఈ ఫలాలకు డిమాండ్ పెరిగింది. డ్రాగన్ పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు సైతం లాభాలు అదే స్థాయిలోనే ఉంటున్నాయి. అయితే సరైన అవగాహన లేక దీని సాగు అంతంతే ఉంది. అత్యధిక మంది రైతులు వెనుకడుగే వేస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించే లక్ష్యంతో సంగారెడ్డిలోని ఫల పరిశోధనా స్థానం అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డ్రాగన్ ఫ్రూట్ మేళాను మంగళవారం నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న పరిశోధనలు..

సంగారెడ్డిలోని కొండా లక్ష్మణ్ ఫల పరిశోధనా స్థానం (ఎఫ్‌ఆర్‌ఎస్)లో డ్రాగన్ ఫ్రూట్‌పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇందుకు ప్రత్యేక బ్లాక్ ఏర్పాటుచేసి వివిధ రకాల మొక్కలను నాటి పెంచారు. ఇటీవలే ఫలసాయం సైతం వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ఇక్కడి నేలలు అనుకూలమని తమ పరిశోధనల్లో ఇక్కడి శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 142 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. కొండాపూర్, నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి మండలాల్లో సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణం పెంపు లక్ష్యంగా మేళాను నిర్వహిస్తున్నారు.



డ్రాగన్ ఫ్రూట్ తోట

అభ్యుదయ రైతులు.. ఔత్సాహికులు

మేళాలో డ్రాగన్ ఫ్రూట్‌కు చెందిన పలు రకాలను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే దీన్ని సాగు చేస్తున్న రైతులతో పాటు ఈ పంట సాగుపై ఆసక్తి ఉన్న వారినీ మేళాకు ఆహ్వానించారు. ఈ పంట సాగుతో ఉన్న ప్రయోజనాలు, ప్రతికూలతలను అభ్యుదయ రైతులు వివరిస్తారు. ఎదురయ్యే ఇబ్బందులు, ఎలా అధిగమించాలన్న అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించనున్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా మెరుగ్గా ఉన్న నేపథ్యంలో దీని సాగుకు ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన శాఖ సంచాలకురాలు యాస్మిన్ బాషా, విశ్వవిద్యాలయం ఉప కులపతి నీరజ ప్రభాకర్, ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర తదితరులు పాల్గొని పలు అంశాలను వివరించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



సంతోష్

మనోహరాబాద్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మేడోజీ సంతోష్‌చారి(36) ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి పుట్టినరోజు వేడుకలకు దండుపల్లి వెళ్లి తిరిగి బయల్దేరాడు. దండుపల్లి చౌరస్తా వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం సంతోష్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరొకరు..



సాయిలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. కొత్తలింగాయిపల్లి గ్రామానికి చెందిన కొల్చూరి సాయిలు(48) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పండగ నిమిత్తం సోమవారం తన ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి ఇంటికి బయలుదేరాడు. మల్లంపేట గ్రామ శివారులోని మలుపు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తల, శరీరానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీతో పాటు కూతురు, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శాశ్వత పనులకు ప్రాధాన్యం: సంజీవరెడ్డి



విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, కల్హేర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు ఉపాధితోపాటు ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఉపాధి హామీ పథకం ఏపీఓలు, సాంకేతిక సహాయకులతో సమీక్ష నిర్వహించారు. చేసిన పనుల్లో 70 శాతం పనులు ప్రజలకు కనిపించాలన్నారు. పీడీ జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ పనులు 'డబుల్ ఎంట్రీ' చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అదనపు పీడీ రాజు, సహాయ పీడీ బాలరాజు, ప్లాంటేషన్ జిల్లా మేనేజర్ మణికుమార్ పాల్గొన్నారు. * నిజాంపేట మండలం శాఖాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, లింగారెడ్డి, రాథోడ్, రాధాకిషన్, రఘుపతిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన

వట్‌పల్లి, న్యూస్‌టుడే: మండల పరిధి పోతులబొగుడ ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించి నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపల్ దీనా తెలిపారు. సోమవారం వట్‌పల్లిలో అంతర్జాల కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీశైలం, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో సీటు సాధించిన విద్యార్థినికి అభినందన

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: నీట్‌లో 720వ ర్యాంకు సాధించి చెన్నై ఎయిమ్స్‌లో సీటు సాధించిన విద్యార్థిని రాజకుమారిని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సోమవారం అభినందించారు. విద్యార్థినిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా శిలాఫలకాలు

ఏళ్లుగా నిలిచిన నిర్మాణాలు

నారాయణఖేడ్, కోహీర్, జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:

ఖేడ్ పట్టణంలో పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచాయి. కొన్ని పనులు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా.. పనులే ప్రారంభం కావడంలేదు. దీంతో సమస్యలు దూరం కావడంలేదు. కొన్ని పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇలా ఖేడ్‌లో సుమారు రూ.30 కోట్లకు సంబంధించిన పనులు నిలిచిపోయాయి. పదేళ్లకిందట స్త్రీశక్తి భవన నిర్మాణాన్ని రూ.25 లక్షలతో ప్రారంభించి పునాదుల్లోనే వదిలేశారు. ఏడేళ్ల కిందట అదనంగా మరో రూ.25 లక్షలు మంజూరు చేశారు. రెండుమార్లు శంకుస్థాపన చేసినా.. పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభించలేదు. అటవీశాఖ కార్యాలయ ఆవరణలో బీట్ అధికారి కార్యాలయ నిర్మాణానికి రూ.10 లక్షలతో పనులు ప్రారంభించి పిల్లర్లు వేసి నిలిపివేశారు.



రెండుసార్లు శంకుస్థాపన చేసిన స్త్రీశక్తి భవనం శిలాఫలకాలు

క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఇదీ..

ఖేడ్ పట్టణంలో రూ.2.15 కోట్లతో ఏడేళ్ల కిందట ఇండోర్ స్టేడియం, నాలుగేళ్ల కిందట ఖేడ్ మండలం జూకల్ శివారులో రూ.కోటితో నిర్మించతలపెట్టిన ఔట్‌డోర్ స్టేడియం పనులకు శంకుస్థాపనలు చేసి పనులను ప్రారంభించినా.. బేస్‌మెంట్ స్థాయిలోనే వదిలేశారు. వ్యవసాయ సహాయక సంచాలకుల కార్యాలయ భవనం ఏడేళ్లుగా శిలాఫలకానికే పరిమితమైంది. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.10 కోట్లతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ, పంచాయతీ, గ్రంథాలయ, ఆరోగ్య ఉపకేంద్రాలు, పశువైద్యశాలల భవనాలు, అదనపు తరగతిగదుల తీరూ అదేవిధంగా ఉంది.

సమీక్షించి చర్యలు: సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, ఖేడ్

వివిధ దశల్లో నిలిచిపోయిన, ప్రారంభం కాని పనులను వెంటనే సమీక్షిస్తాం. ఈ పనుల కొనసాగింపునకు అవసరైన నిధుల మంజూరుకు తగు చర్యలు తీసుకుని వాటిని పూర్తిచేయించి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తా.

నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం!

జహీరాబాద్ డివిజన్ కోహీర్‌లో రూ.26 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు గుత్తేదారు మొదలు పెట్టకపోవడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లే ప్రమాదం నెలకొంది. ఏళ్లకందట మంజూరైన అంగన్‌వాడీ భవనాలకు నిధులు చాలలేదని గుత్తేదారులు పలు ప్రాంతాల్లో పనులు నిలిపివేశారు. సుమారు 15 భవనాలకు తలుపులు, కిటికీలు, విద్యుత్తు తదితర పనులు మిగిలిపోయాయి. ఫలితంగా ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయడం మారుతున్నాయి. కోహీర్ మండలం గొట్టిగార్‌పల్లి పంచాయతీ భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో కార్యకళాపాలు రైతువేదికలో నిర్వహిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట

? సంగారెడ్డిలోని రాజంపేటలో చెత్తసేకరణ సిబ్బంది సరిగారావడం లేదు. చెత్త ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. - **గోపాల్, సంగారెడ్డి.**

✓ చెత్తసేకరణ సిబ్బంది క్రమం తప్పకుండా వెళ్లాలని సూచనలు చేస్తాం. - **సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సంగారెడ్డి.**

? పోతిరెడ్డిపల్లిలోని బ్యాంక్ కాలనీలో మంచినీళ్లు పూరిరావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. - **సంతోష్, సంగారెడ్డి.**

✓ ప్రతిరోజు గంటపాటు మంచినీళ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. - **ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.**

? జోగిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పట్టణంలోకి వెళ్లే ప్రధాన దారి గుంతలుగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **-శ్రీధర్, జోగిపేట.**

✓ గుంతలు పడిన దారికి మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారిస్తాం. **-తిరుపతి, కమిషనర్, అందోలు- జోగిపేట.**

? జోగిపేటని చేనేత సహకార సంఘం సమీపంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద ప్రమాద నివారణ కంచెను ఏర్పాటు చేయలేదు. కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. **-వెంకటేశం, జోగిపేట.**

✓ విద్యుత్తు వద్ద కంచెను ఏర్పాటుచేస్తాం. - **శ్రీనివాస్, ఏఈ.**

'డిజిటల్ కార్డు' వివరాల నమోదు



కంది, న్యూస్‌టడే: 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా వాటిల్లో వివరాలు పొందుపరుస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. కంది మండలం తోపుగొండలో సేకరించిన కుటుంబ వివరాల సమాచారం సోమవారం కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న తీరును ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎంపీఓ మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు శ్రీధర్ స్వామి, లక్ష్మారెడ్డి, వందన, ఉషా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా సోమవారం సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఇజ్రాయెల్ ఏడాదిగా పాలస్తీనా భూభాగాలపై, లెబనాన్ ఆసుపత్రులు, పాఠశాలలు, మసీదులపై వైమానిక భూతల దాడులతో వేలాది మందిని పొట్టన పెట్టుకోవడం అమానుషమన్నారు. యుద్ధాల వల్ల భారతదేశంలో ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, యాదగిరి, రేవంత్, అశోక్, కృష్ణ, రాజయ్య, మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో ఇటీవల కురిసిన వర్షాలకు పసుల శ్రీనివాస్ ఇల్లు కూలడంతో ఆ కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు. అదే గ్రామానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యుడు మేకల జ్ఞానేశ్వర్ తన కూతురు హైందవి ప్రియదర్శిని పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం శ్రీనివాస్‌కు అందజేశారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: పురపాలికలో మంచినీటి విభాగంలో పని చేసే కార్మికుడు వెంకటేశం ఇటీవల మరణించారు. ఈ విభాగంలో పని చేసే 98 మంది కార్మికులు ఒక రోజు వేతనం రూ.500 చొప్పున రూ.49 వేలను జమ చేశారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలంటూ గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు బాబూరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, దశరథ్, నాయకులు పాల్గొన్నారు.

తుల్జాపూర్‌లో కొనసాగిన భక్తుల రద్దీ

జహీరాబాద్: మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు, తుల్జాపూర్ పట్టణంలోని వీధుల్లో సందడి నెలకొంది.

ఖాళీ స్థలాలు.. సమస్యలకు నిలయాలు



సదాశివపేట పురపాలక సంఘం పరిధిలో ఖాళీ స్థలాల్లో పెరిగిన పొదలు చిట్టడవిని తలపిస్తున్నాయి. ఈ ప్రాంతంలోనే పలువురు చెత్తవేయడంతోపాటు మురుగు నిలుస్తోంది. ఇక్కడ దోమల వృద్ధితో పాటు క్రిమికీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. పట్టణంలోని సుమారు 15 కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పరిస్థితి ఇదేవిధంగా ఉంది. – న్యూస్‌టుడే, సదాశివపేట.

దారుల్లో గుంతలు.. రాకపోకలకు తిప్పలు



గుమ్మడిదల మన్నెగూడెం 7వ వార్డులో వర్షాల వల్ల రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రివేళ వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ కార్యదర్శి ప్రభాకర్‌రావు 'న్యూస్‌టుడే' ప్రతినిధితో మాట్లాడుతూ రోడ్డును పరిశీలించి గుంతలు పూడ్చివేయిస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌ఖటుడే, గుమ్మడిదల.

వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు

హత్నూర, ఝరాసంగం: ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం హత్నూరలో బతుకమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించారు. రకరకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలను ఒకచోట పెట్టి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఏపీఎం దేవేందర్, సీసీలు కల్పన, సావిత్రి, నాగరాణి, పద్మవేణి, కిష్టయ్య, మహేష్, మండల సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు సుశీల, సుమలత తదితరులు పాల్గొన్నారు.



హత్నూరలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ తదితరులు



ఝరాసంగం ఎంపీడీవో కార్యాలయం వద్ద బతుకమ్మ సంబరాలు

'ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు తగవు'

నారాయణఖేడ్: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూపీ ఘజియాబాద్‌కు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని సోమవారం ఖేడ్‌లో మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో నిరసన తెలిపారు. అనంతరం ఆ సంఘ నాయకులు తాహెర్‌అలీ, గౌస్‌చిష్తీతోపాటు ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మొహిద్ పటేల్, ఖేడ్ మాజీ సర్పంచి నజీబ్, నాయకులు వేర్వేరుగా ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు అందజేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

వెల్దుర్తి, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి కుకునూర్ గ్రామానికి చెందిన నర్సింలు అనారోగ్యంతో చికిత్స చేయించుకోగా రూ.15 వేలు, వెల్దుర్తికి చెందిన గంగామణికి రూ.33 వేల ఎల్‌వోసీ పత్రాలను వెల్దుర్తిలో అందజేశారు. భారాస జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, పాండురంగం, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



లక్ష్మినారాయణ (పాతచిత్రం)

జోగిపేట న్యూస్‌టుడే: రెండు రోజుల కిందట అందోలు గ్రామ శివారులోని రహదారి విభాగినిని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో వంశీ అదేరోజు మృతిచెందగా.. మరో యువకుడు లక్ష్మినారాయణ(19) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

సిర్గాపూర్: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తప్పవని ఎస్సై వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సిర్గాపూర్‌లోని శివాజీ కూడలి వద్ద సోమవారం వాహన చోదకులకు శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురిపై 'డ్రంకెన్ డ్రైవ్' కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మత్తులో వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ముదిరాజ్ గ్రామ కమిటీ ఎన్నిక

జిన్నారం: మంగంపేట ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏగుల వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా చింతల్‌చెరు భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా ఆకుల ఆంజనేయులు, కోశాధికారిగా అబ్బుగారి రాములు ఎన్నికయ్యారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

మనూరు: అమలవుతున్న కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలని 'సభ్యత్వ డ్రైవ్ ఇన్‌ఛార్జి' రవీశంకర్ పేర్కొన్నారు. సోమవారం మనూరులో నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, మండల అధ్యక్షులు ఈశ్వరప్ప, నాయకులు అజయ్, సాయి, తేజ ఉన్నారు.

రూ.25 వేల విరాళం

జిన్నారం, న్యూస్‌టుడే: మాదారంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించటానికి మాజీ సర్పంచి సురేందర్ గౌడ్ సోమవారం కార్యదర్శి నవీన్‌కు రూ.25 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, అమరేందర్ గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సోయా రైతులకు భరోసా

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

ఆరుగాలం శ్రమించే సోయా రైతులకు ప్రభుత్వం తీపి కబురు ప్రకటించింది. దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించేలా జిల్లాలో ఐదుచోట్ల కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది. లారీలు, హమాలీల, తూకం యంత్రాలు, టాటిపత్రులు ఎలాంటి కొరత లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. రైతులకు కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తుంది. ఇటీవల మనూర్‌లో డీసీఎంఎస్ కేంద్రంలో సోయా కొనుగోలు కేంద్రం వినియోగంలోకి తీసుకొచ్చింది. త్వరలో జహీరాబాద్(ఏఎంసీ), ఝరాసంగం(పీఏసీఎస్), మునిపల్లి మండలం పెద్దచెల్మడ కలాన్(పీఏసీఎస్), నారాయణఖేడ్(ఏఎంసీ)లో ఏర్పాటుకు జిల్లా మార్క్‌ఫెడ్ శాఖ సన్నాహాలు చేస్తోంది.



మనూరులో సోయ కొనుగోలు కేంద్రం

జిల్లాలో ఐదుచోట్ల కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 72,395 ఎకరాల్లో

ఈ ఏడాది వానాకాలం సోయ పంట 72,395 ఎకరాల్లో సాగయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా మొగుడంపల్లి, జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, సిర్గాపూర్, కంగ్టి, నారాయణఖేడ్, మునిపల్లి, తదితర మండలాల్లో సోయను సాగుచేశారు. కిందటి నెలలో వర్షాలకు 1271 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లుగా వ్యవసాయ శాఖ సర్వేలో తేల్చింది. నష్టం వివరాలను సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఎకరానికి కనీసం 11 క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుందని సంబంధిత శాఖ వర్గాలు పేర్కొంటున్నారు. ఈ ప్రకారం 7,96,355 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. వారికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.4892 చెల్లింపులు చేస్తుంది. విఫణిలో క్వింటాలుకు రూ.4600 మద్దతు ధర పలుకుతోంది.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: శ్రీదేవి, మార్క్‌ఫెడ్ డీఎం, సంగారెడ్డి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం క్వింటాలుకు రూ.4892 చొప్పున చెల్లింపులు చేస్తాం ఇప్పటికే మనూర్‌లో కేంద్రాన్ని ప్రారంభించాం. మిగిలినవి త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. 10వేల మెట్రిక్ టన్నుల వరకు సోయ విక్రయాలు చేసేందుకు నాఫెడ్ నుంచి అనుమతులు ఇచ్చింది. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం. తేమ శాతం 12 మించ కుండా ఉండాలి. చెత్త చెదారం లేకుండా చూసుకోవాలి. కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించాం.

ఎత్తిపోతల పనులు ప్రారంభించాలి

నారాయణఖేడ్: బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ ఖేడ్ డివిజన్‌కార్యదర్శి ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ భూములకు సాగునీటిని అందించాలనే ఆలోచనతో ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలైనా పనులు ప్రారంభించడం లేదన్నారు. నాయకులు చిరంజీవి, అశోక్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి'

సంగారెడ్డి గ్రామీణ: శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే రైతుల ఖాతాల్లో రూ.2 లక్షలు జమ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, రాములు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం పునరుద్ధరిచండి

కోహీర్, న్యూస్‌టుడే: కవేలి కూడలి సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వేతన ఒప్పంద కాలపరిమితి పూర్తయి ఎనిమిది నెలలు గడిచినా యాజమాన్యం పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్, కార్మికులు దేవులయ్య, అబ్దుల్ లతీఫ్, శివరామరావు, సంగమేశ్వర్, జైపాల్‌రెడ్డి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రజలందరి సహకారంతో 23వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టినట్లు కౌన్సిలర్ కూన వనిత అన్నారు. శివాజీ నగర్‌లో కౌన్సిలర్ వనిత అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్ చేస్తే చాలు సమస్యల పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్రకార్యదర్శి సంతోష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలి

పెద్దశంకరంపేట: ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ గ్రేస్ బాయి తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే ఎన్నికల్లో ఓటుకు పట్టభద్రులు తమ ఓటును నవంబర్ 6వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో కూడా అవకాశం ఉందన్నారు.

ముస్లాపూర్‌లో క్రికెట్ టోర్నీ

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: మండల పరిధి ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఆయా యువజన సంఘాల నాయకులు సోమవారం క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు టేక్మాల్ మండలంలోని పలు గ్రామాల యువకులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టెలికాం బోర్డు సభ్యుడికి సన్మానం

చేగుంట: జిల్లా టెలికాం బోర్డు సలహా సంఘం సభ్యుడిగా నియామకమైన మంద బాలచంద్రంను చేగుంట ఏఎంసీ మాజీ ఛైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్ సోమవారం సన్మానించారు.

అలంకరణలో అమ్మవార్లు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. – న్యూస్‌టుడే బృందం.



సామూహిక కుంకుమార్చన



ఐడీఏ బొల్లారంలో...



కేతకిలో...



తుల్జాపూర్ ఆలయంలో భక్తుల సందడి



బొంతపల్లిలో...



గుమ్మడిదలలో..

వైద్య చికిత్సకు ఆసరా

నర్సాపూర్, హత్నూర, న్యూస్‌టుడే: పేదల వైద్య చికిత్సలకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన నాగరాణికి రూ.2.25 లక్షలు, నర్సాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన సువర్ణకు రూ.1.25 లక్షల సీఎం సహాయ నిధి ఎల్‌వోసీ పత్రాలను సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కర్రే కృష్ణ, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కిష్టయ్య పాల్గొన్నారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న రాజిరెడ్డి